

# "నాకు అంతా తెలుసు. అందుకనే...."

భమిడిపాటి వెంకటరమణ

★

గొంతుక భగ్గున మండింది ఆమెకు. మరో గ్లాసుడు మంచినీళ్ళకోసం భర్తనడిగింది, ఆమె కంఠధ్వని వినగానే అతనికి ఒళ్లల్లా జలదరించింది.

బారుగా తెరిచిన పెద్దకిటికీ దగ్గర మంచం మీద పడివుంది ఆమె. గాలి గదినంతటిని వింత వింత మట్టివాసనలతో నింపుతూంది. తోటలోని పారిజాతాల వాసనలు అరటిపువ్వు వాసనల్ని పిల్ల గాలులు మోసుకొస్తున్నాయి. సూర్యుడు అప్పుడే తూర్పుకొండలో ఎక్కుతున్నాడు. అరుణకాంతుల జ్వాలలు నీలిమేఘాలకి తగిలి బంగారు సర్పాల్ని ప్రసవిస్తున్నాయి.

"ఒక్కమాట!" అన్నదామె అతి ప్రయాసం మీద. ఎక్కడ్నుంచో పాత వాద్యాలమీద పాడుతున్న యువకకంఠాల సంగీతం వినిపిస్తూంది. ఉండుండి దగ్గరవుతూంది.

"వాళ్లెవరో పాడుతున్నారు అవతల. నీకేమయిన కష్టంగా వుంటే చెప్పు, ఆపమని కోరి వస్తాను."

"అక్కర్లేదు. నాకది బాగానే వుంది."

గొంతుకలోని మంటతో భరించలేక ఆమె మెడని పక్కకి వాల్చేసుకుంది. గుండెలమీద నున్న చేతులు పక్కకి జారాయి విశ్రాంతికోసం.

కర్కశమైన రాత్రి తన శరీరాన్నంతటిని ముక్కముక్కలుగా బాధపెట్టిన తరువాత ప్రభాతకాలపు చల్లదనాలు ఆమెను కొంత హాయినిచ్చాయి.

బరువైన కనురెప్పలకింద నున్న ఆమె అర్ధనిమీలిత నేత్రాలు మెల్లిగా తెరుచుకొని తోటలోని ఎత్తయిన వృక్ష శిఖరాల్ని పరిశీలిస్తున్నాయి. అపూర్వమైన పుష్పాల్ని గమనిస్తున్నాయి. దూరాన్న పొలాల్లో కూలీలప్పుడే పని ప్రారంభించారు. ఆమె యువకహృదయం అంత నీరసంలో తృళ్లింతలాడసాగింది. పరవళ్ళు తొక్కబోయింది.

ఆ పెద్దతోట, ఆ పొలాలు, సిరిసంపదల్ని పిలికే ఈ భూభాగమంతా, ఈ వెలుగూ, ఈ కాంతీ ఇదంతా తన భర్తదే. ఆయన స్వంతం.

ఇందులో ఆయనది కానిదేమీ లేదు.

ఎన్నిసార్లు ఆమె కిటికీ కాంతిలో నిలబడి ఈ విశాలసృష్టిలో తన అల్పత్వానికి భయపడి దిగులు పొందలేదు. ఈ సృష్టి సౌందర్యం ముందు తనెంత చిన్నదాన్నని ఉదాసీనపడలేదు? ఈ ఇల్లు ఏదో విచిత్రమైన రాజనగరులా ఉంది. ఈ రాజ్యానికి సర్వ అధికారి తన భర్త. ఆయనదే కాకపోతే తనకెక్కడా స్థానమే లేదు.

భయపడుతూ భయపడుతూ మెల్లిగా అతని వైపు చూసింది. అతడు తనను దగ్గరగానే బుర్ర వంచుకొని కూచున్నాడు. పండబారుతున్న అతని జుత్తు ఎర్రగా కాలిన ఇనపకమ్మిలాటి అతని మెడ కనబడుతున్నాయి. అతని శరీరంలో అవయవాలన్నీ ఎక్కడివక్కడే తీర్చిదిద్ది అమర్చినట్టున్నాయి. ఆ ముఖం తేరిచూడ్డానికి ఎవరికయినా

జంకు పుడుతుంది. అరచేతి చదరాన్ని ఉన్న నుదురు, గెడ్డముక్కలా వంపు తేరిన ముక్కూ పలచని గడ్డాం. ఈ మనిషిని తనెలా ప్రేమించగలిగింది? ఇతనికోసమనా తాను ఇల్లువదలి, తల్లిదండ్రుల్ని వదలి కావలసినవాళ్ళని వదిలి ఇంత దూరం వచ్చింది? ఈ గాత్రుసస్వరూపుడికి తన ఇల్లు తోట తప్పితే ఇంకే వస్తువుమీదయినా ప్రేమ అంటూ ఉండిందా? మరి ఆలోచించలేక పోయింది ఆమె. ఎడంపక్కలో నొప్పిపుట్టి జ్వాలలా శరీరం అంతా వ్యాపించింది. నల్లబారిన ఆమె పెదవులు కొద్దిగా విడి "అమ్మా!" అని ఆ బాధని బయటికి తప్పించాయి. ఆయన తలెత్తాడు, కళ్లు కళ్లూ కలిసాయి. అంత బాధలోనూ ఆమె కళ్ళలో ఆదరం, ఓర్మి అగుబడింది. ఆయన కళ్ళు పచ్చల్లా ప్రకాశిస్తున్నాయి ధగధగ.

"ఏమిటి కావాలి నీకు?" అడిగాడాయన నెమ్మదిగా.

"డాక్టరు ఈసరికి వస్తాడా?"




ఫౌంటెన్ పేనాలకు
బహుశ్రేష్ఠమైనవి, పేరుపొందినవి.
రేడియో సిరాలు
విదేశపు సిరాలతో సాటియైనవి
మద్రాసు, ఆంధ్రజిల్లాలకు డిస్ట్రిబ్యూటర్లు:
మెసర్సు శర్మ ట్రేడింగ్ కంపెని
67, బిగ్‌స్ట్రీట్, తిరువళ్ళిక్కేణి, మద్రాసు.

"చాలాదూరం పట్నం, డాక్టరుకోసం పంపాను. చీకటి ఉండగానే వెళ్ళాడు."

భర్త కళ్ళల్లో ఏదో విజయం పొందిన గర్వం ప్రకాశిస్తున్నట్టు అనిపించింది ఆమెకు. తనకు ఇదివరకు ఈ రూపం ముందు కలిగే భయం ఇప్పుడు దృఢమయింది. ఆమె ఒక్కసారి వణకిపోయింది, భయంతో నీరయిపోయింది. గుండె లోపలికి దూసుకుపోయింది. ఆ భయం వాడయిన కత్తిలాగ. ఆమె భయపడ్డట్టు తెలిసి ఆయన తన కఠినమైన వేళ్ళతో, తల నిమురుతూన్నట్టుగా చెయ్యివేసాడు. ఈ స్పర్శ తగలగానే విభ్రాంతి పుట్టి ఆమె మెల్లిగా సావధానపడింది. తన భయం అర్ధం మాలినది, ఆయను తన్ను ప్రేమిస్తున్నాడు? అయితే ఆ ప్రేమలో మార్దవం కనుపించకపోవచ్చు. అది బలీయమైన కామంతో కూడుకున్నది కావచ్చు. కాని తన కోరికలు-ఎలాటివయినా-తీర్చడానికి ఆయ నెప్పుడూ వెనుదీసేవాడు కాదు. తన స్పర్శమాత్రాన ఆయన ఆనందంతో ఒళ్ళు మరిచేవాడు. గతరాత్రి మాత్రం నిద్ర మాని తనని కనిపెట్టుకొని కూచోలేదా రాత్రంతా తనకు సేవ చెయ్యలేదా? ఎందుకు భయపడాలి. అతడు తన వశమే అయి ఉన్నప్పుడు తలంచుతే తానే రెండుమాటలతో అతని జీవితం ముక్కలు చేయగల్గినప్పుడు తనెందుకు భయపడాలి?

ముక్కముక్కలుగా నలిగిన ఆ తరుణ శరీరం నీరసించి హృదయాన్ని కూడా మెత్తన చేసింది. హృదయంలో పశ్చాత్తాపంపుట్టి క్షణంలో మాయమయింది. కాని ఆ తర్వాత తాను మరి చూడడానికే భయపడ్తున్న ఆ ముఖాన్ని మరింత ప్రేమతో అభిమానంతో చూడాలనిపించింది ఆమెకు. చటాలున అతనివైపు తల తిప్పింది. ఆయన పరధ్యానంగా వుండి తనని గమనించకపోయేసరికి ఆమె 'అయ్యో!' అని మూల్గింది.

తన అప్పటి బాధ, నరనరాలు బిగుంచుకొనిపోయి తీవ్రమైన అలసటలో, క్షణక్షణమూ క్షీణించే తన కండరాల బలం చూస్తే ఆమెకు మృత్యువు సాక్షాత్కరిస్తున్నది. ఈ విశాలమైన గదిలో తనకింక చావు దగ్గరవుతున్నది. ఆ సంగతి తన భర్తకి తెలిసినట్టేవుంది. ఆమె ఆ సంగతి తెలుసుకున్నదని ఆయన చూపులు మళ్ళించుకున్నాడు.

దూరాన్ని మానవ శరీరాలు శ్రమలో చెమటోడ్చి ధగాధగా మెరుస్తున్నాయి. వెలుగులో గాలిలో అద్భుతమైన వాసనలు ప్రవహిస్తున్నాయి.

ఆకాశం అపూర్వ కాంతులతో రంగవల్లికలల్లుతోంది. ఆమె ఎన్నడూ అంత ఆనందం అనుభవించలేదు. ఈ చివర క్షణాల్లో ఆమెకు ఎంతో హాయిగావుంది. ఆ ప్రకృతిని అనుభవించడానికి ఎన్నాళ్ళయినా బతికుండాలనిపించింది. తన భర్త నొకసారి తాకాలనిపించింది ఆమెకు. ఆయన ఎలాంటివాడయినా తనకు కావలసినవాడు అతడొక్కడే. కాని అందువల్ల తనకింకా సంతృప్తి కాదు. అతనికి చెప్పాలి. అంతా చెప్పాలి.

"ఇదుగో!" అన్నదామె. మృత్యువు శీతల స్పర్శ అప్పుడే తగిన కంఠంలో ఆమాట గుడుగుడులాడింది.

"ఒక్కమాట చెప్పకుండావుండలేను. మీరు క్షమించండి చావలేను" అని ఊరుకొంది ఆమె. గాఢంగా నిశ్వాసం తీసుకుంటూంది.

"నేను మీకు ద్రోహంచేసాను. మొన్న ఈ ఊరికొక విద్యార్థి సంఘం వచ్చింది. అందులో ఒక..." తన బలాన్నంతటనీ ఉపయోగించే ప్రయత్నంలో ఆమె పడిపోయింది. మరి కదలలేకపోయింది. ఆయన కొంతసేపు ఆమెను పరీక్షగా చూసాడు. అతిహీనంగా ఆమె బాధను భరిస్తూ మృత్యువు ఒడిలో విశ్రాంతి తీసుకుంటూంది. అప్పుడాయన సమాధానం యిచ్చాడు శాంతంగా గంభీరంగాను:

"నన్నుకూడా నువ్వు క్షమించాలి. నాకు అంతా తెలుసు. అందుకనే నీకు నిన్న విషం యిచ్చాను."

---

## మేయరు సుభాషితం

చారిత్రకంగానే కాక వ్యాపార సంబంధాలవల్ల కూడా చెన్నపట్టణం ఆంధ్రులదేనని చెప్పవలసివుంది. పట్టణంలో తమిళులు అధిక సంఖ్యాకులయినప్పటికీ కారణాంతరాలచేత చెన్నపట్టణం ఆంధ్రులకే చెందుతుంది.

—సుందరరావు నాయుడు

శారదా ప్రొడక్షన్సు

# పల్నాటి యుద్ధం

★

## 7-9-47 తేదీన పత్రికాప్రతినిధులకు ప్రదర్శనము

ఆంధ్రుల కీర్తిప్రతిష్ఠలకు ఆలవాలమయినది, ఆంధ్రపౌరుషాన్ని ముమ్మూర్తులా ప్రదర్శించినదీ "పల్నాటి యుద్ధం". ఈ మహత్తర గాథ తలచుకున్నంతనే తెలుగువారికి ఒళ్లు పులకరిస్తుంది. అటువంటి ఇతివృత్తాన్ని కథావస్తువుగా తీసుకుని మన గూడవల్లి రామబ్రహ్మంగారు తెరకెక్కించారు.

నాగమ్మ, బ్రహ్మనాయుడు, బాలచంద్రుడు— ఇవన్నీ తెనుగునాట గృహనామములై వెలిశాయి. అంచేత సకల జనరంజకమయిన ఈ చరిత్ర తెరపైన తెనుగువారికి ఉత్తేజం కలిగిస్తూ, వారి హృదయాన్ని మారగొంటుందనడానికి సందేహం లేదు.

ఇటువంటి సమర గాథలు తయారుచేయడం బహు వ్యయప్రయాసలతో కూడుకొన్న పని ఇటువంటివి ఇతర భాషల్లో ఎన్నో మనం చూస్తున్నాము. కాని, తెనుగులో మాత్రం ఈ తరగతికి చెందిన చిత్రాలలో ఇదే మొదటిదని చెప్పాలి.

శారదా ప్రొడక్షన్సువారు ఈ చిత్రనిర్మాణంలో అకుంఠితమైన శ్రద్ధాసక్తులు చూపినట్లు అడుగడుగునా రుజువవుతునే వున్నది. ఇందు పాల్గొన్న తారాగణం గణనకెక్కినదే. కన్నాంబ, గోవిందరాజుల, వరలక్ష్మి మున్నగు వారందరూ ఎవరి పాత్రలను వారు స్తుతిపాత్రంగా నిర్వహించారు.

ఫొటోగ్రఫీ, సౌండ్ రికార్డింగు స్ఫుటంగా శ్లాఘ్యంగా ఉన్నవి. సముద్రాలవారి లేఖినినుండి వెలువడిన ఇందలి మాటలూ, పాటలూ అక్షరలక్షల విలువచేసే అమృతగుళికలు.

అయితే—ఎంతో ఉత్సాహపడిన డైరక్టర్ రామబ్రహ్మంగారు ఈ చిత్రాన్ని చూడనోచుకోలేకపోవటమే విషాదకర విషయం. దీనికి తొలుత స్వర్గీయ రామబ్రహ్మంగారి నిర్యాణ దృశ్యాలు చూపటం సముచితంగా వుంది.

---

* ఆనందవాణి